సాక్షి
వికారాబాద్
సోమవారం । 18 । మార్చి । 2024



‘పట్నం’ శిబిరంలో నైరాశ్యం

కాంగ్రెస్ ఢిల్లీ రాజకీయాలు పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబంపై తీవ్ర ప్రభావం చూపాయి. 8లో▸



గ్రామాల్లో సమస్యల తిష్ట

ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. దీంతో ప్రజలు మండి పడుతున్నారు. 9లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
సోమవారం (సాయంత్రం)	మంగళవారం (ఉదయం)
6:32	5:00

న్యూస్‌రీల్

ఇద్దరికి కార్పొరేషన్ పదవులు

పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా గురునాథ్‌రెడ్డి



గురునాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కొడంగల్: తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. విషయం తెలుసుకున్న ఆయన అభిమానులు ఆదివారం ఆయన్ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గురునాథ్‌రెడ్డి వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సయమంలో స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సీనియర్ నాయకుడిగా.. కొడంగల్ నియోజకవర్గంలో తిరుగులేని నేతగా ఉన్న గురునాథ్‌రెడ్డి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు సృష్టించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గురునాథ్‌రెడ్డిలు 1978లో ఒకేసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. 1978, 1983, 1999, 2004లో గెలుపొందారు. 1985 మధ్యంతర ఎన్నికలు, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలై రెండు పర్యాయాలు హ్యాట్రిక్ విజయం చేజారింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, సామాజిక కార్యకర్త మురహరి వశిష్ట, డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి, కోఆప్షన్ సభ్యుడు మునీర్, లయన్స్‌క్లబ్ కార్యదర్శి దాసప్ప యాదవ్, మిఠాయి రాజు తదితరులు పాల్గొన్నారు.

వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా సుజాత

తాండూరు: పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు కల్వ సుజాతకు కార్పొరేషన్ పదవి వరించింది. రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్ణాటక సరిహద్దులో ఉన్న తాండూరు పట్టణానికి చెందిన సుజాత వ్యాపార నేపథ్యం ఉన్న కుటుంబం ఆమెకు రాజకీయాలపై మక్కువతో కాంగ్రెస్‌లో చేరింది. పాతికేళ్లుగా పార్టీలో ఉంటూ జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టారు. అనంతరం రాష్ట్ర స్థాయి మహిళా కాంగ్రెస్ విభాగంలో పదవుల్లో కొనసాగారు. నాలుగేళ్లుగా పీసీసీ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. తాండూరు ప్రాంతానికి చెందిన కల్వ సుజాతకు చైర్‌పర్సన్ పదవి ఇవ్వడంతో కాంగ్రెస్ నాయకులతో పాటు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఈము రైతులను ఆదుకోండి

ఉప ముఖ్యమంత్రికి రైతుల వినతి



డిప్యూటీ సీఎం భట్టిని కలిసి వినతిపత్రం అందజేసిన ఈము రైతులు

షాద్‌నగర్: ఈము పక్షులు పెంచి ఆర్థికంగా ఎంతో నష్టపోయామని, తమను ఆదుకోవాలని కోరుతూ ఈము పక్షుల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతులు ఆదివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. ఈము రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్లోళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ... నాబార్డు మాటలు నమ్మి చాలామంది రైతులు ఈము పక్షలను పెంచారని అన్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.30లక్షల వరకు రుణ సదుపాయం ఉంటుందని ప్రకటించడంతో చాలామంది ముందుకు వచ్చి పక్షులను పెంచారని తెలిపారు. ప్రభుత్వం సరైన మార్కెటింగ్ సదుపాయం కల్పించకపోవడంతో పెట్టుబడి భారంతో భారీ నష్టం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. రుణాలు మాఫీ చేసి ఈము రైతులను ఆదుకోవాలని ఉప ముఖ్యమంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

కన్స్యూమర్ రైట్స్ చైర్మన్‌గా నగేష్‌కుమార్

కొత్తూరు: నేషనల్ కన్స్యూమర్ రైట్స్ జిల్లా కమిషన్ చైర్మన్‌గా కొత్తూరు పట్టణానికి చెందిన నగేష్‌కుమార్ రెండో సారి ఎన్నికయ్యారు. భద్రాద్రి కొత్తగూడెంలో జాతీయ కన్స్యూమర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో తనను ఎన్నుకోవడంతో పాటు నియామక పత్రం అందించినట్లు నగేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

‘పది’కి సన్నద్ధం

నేటి నుంచి వార్షిక పరీక్షలు

- అధికారులకు ‘టెన్’షన్
- ఐదు నిమిషాలలోపు ఆలస్యానికి అనుమతి

బాలురు	బాలికలు	మొత్తం
6,913	6,499	13,412



వికారాబాద్: పదోతరగతి వార్షిక పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షా కేంద్రాల్లో శనివారం హాల్‌టికెట్ నంబర్లను వేశారు. పరీక్షలు రాసే విద్యార్థులు 45 నిమిషాల ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా అధికారులు సూచించారు. పరీక్షలు జరిగే సమయాల్లో జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని ఇప్పటికే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్లు, లైట్లు, ఫ్యాన్లు, బెంచీలు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఎండలు తీవ్రమవడంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఒక్కో పరీక్షా కేంద్రంలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 80 మంది ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంటారు. పరీక్షలు ఈనెల 18 నుంచి 30వరకు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 80 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. అనుకోని పరిస్థితితో విద్యార్థులు ఆలస్యం అయితే 9.35 గంటల వరకు విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు అనుమతించనున్నారు.

కాపీయింగ్ నిరోధానికి కఠిన చర్యలు

కాపీయింగ్ నిరోధానికి విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడితే ఇన్విజిలేటర్లను బాధ్యులను చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. మాస్‌కాపీయింగ్, అందులో ఉపాధ్యాయుల ప్రమేయంతో గతేడాది జిల్లాలో గందరగోళ పరిస్థితి నెలకొన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో కలెక్టర్ వారం రోజులుగా ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో కేవలం డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు తదితర అధికారులతో మాత్రమే సమావేశం ఏర్పాటు చేసి సూచనలు చేసేవారు. ఈ ఏడాది కలెక్టర్ నేరుగా ఇన్విజిలేటర్లతో సమావేశం ఏర్పాటు చేసి తగు సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. అనుకోని సంఘటనలు ఏమైనా జరిగితే ఇన్విజిలేటర్లతో పాటుగా జిల్లా, మండల విద్యాధికారులు సైతం బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ హెచ్చరించారు. దీంతో జిల్లాలో కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలవద్ద పరీక్షా సమయంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు రవాణా పరంగా అసౌకర్యం కలుగకుండా సకాలంలో బస్సులను నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు విద్యాశాఖ సూచించింది.

అధికారులకు డబుల్ సవాల్

ఈ సారి జిల్లా విద్యాశాఖతో పాటు ఉన్నతాధికారులు పది పరీక్షల విషయంలో డబుల్ చాలెంజ్ ఎదుర్కోనున్నారు. గతేడాది ఫలితాల్లో జిల్లా అట్టడుగున నిలిచిన నేపథ్యంలో ఫలితాలతు మెరుగుపర్చుకోవడం చాలెంజింగ్‌గా మారింది. మరోవైపు గతేడాది పేపర్ లీకేజీ వ్యవహారం చోటు చేసుకోవడం.. అందులో ప్రభుత్వ ఉపాధ్యాయులే బాధ్యులుగా తేలి జైలుకు వెళ్లి బర్తరఫ్‌కు గురయ్యారు. ఈ ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు డబుల్ సవాల్ ఎదుర్కొంటున్నారు. కాగా కేవలం పరీక్షల సమయంలో అధికారులు హల్‌చల్ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాకు పేరు తీసుకురండి



పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నాం. విద్యాశాఖ అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అన్ని సూచనలు చేశాం. విద్యార్థులు మంచి వాతావరణంలో పరీక్షలు రాయాలి. గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి. విద్యార్థులకు ఆల్ ది బెస్ట్.

– నారాయణరెడ్డి, కలెక్టర్

పటిష్ట బందోబస్తు



పరీక్షా కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. కేంద్రాల వద్ద మరియు పరీక్షలకు చేరుకునే సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తినా.. అసౌర్యాలు కలిగినా వెంటనే 100 డయల్ చేయాలి. పరీక్షల సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలి. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదు. కేంద్రాల వద్ద గుంపులుగా తిరిగినా చర్యలు తీసుకుంటాం. పరీక్షలు సజావుగా సాగేందుకు అందరు సహకరించాలి. విద్యార్థులందరికి బెస్ట్ ఆఫ్ లక్.

– కోటిరెడ్డి, ఎస్పీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

జిల్లాకు సాగునీరు తెస్తాం

- గత ప్రభుత్వం మోసం చేసింది
- గ్యారంటీలు అమలు చేస్తున్నాం
- శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

పరిగి: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ తెర్లయింది.. వారు చేసిన తప్పులను సరిచేసుకుంటూ సమర్థవంత పాలన అందిస్తున్నామని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం 80 శాతం గ్యారంటీలను అమలు చేస్తున్నది ప్రతీ ఒక్కరికి తెలిసిన నిజమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సాగు నీరందించేందుకు తీసుకువచ్చిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును గత ప్రభుత్వం రద్దు చేసి మన జిల్లాకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా నీరందిస్తామని చెప్పి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మన ప్రాంతానికి సాగునీరందించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారని చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నిత్యం ప్రజాసంక్షేమానికే పరితపిస్తారన్నారు. ప్రభుత్వ నిధులతో జిల్లా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట: ఎమ్మెల్యే టీఆర్ఆర్

రాష్ట్ర ప్రభుత్వం మహిళాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం రూ.7లక్షల కోట్లు అప్పులు చేసినా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీలు అమలు చేస్తూ సమర్థవంతంగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గానికి రూ.4,720 కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నామన్నారు. నేవీ రాడార్ ఏర్పాటుతో ఎంతో మందికి ఉపాధి, నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. పరిశ్రమలను తీసుకువచ్చి మన ప్రాంత ప్రజలకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కృష్ణ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్లను గెలిచి మోదీకి కానుకగా ఇద్దాం

బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల సీటును గెలిచి మోదీకి కానుకగా అందిద్దామని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సీహెచ్‌ఆర్ గార్డెన్‌లో ఆదివారం నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం మొత్తం పేదల గుండెల్లో మోదీ ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో నాయకులు పార్టీలు మారుతూ ఒకచోటకు చేరుతున్నారని, వారంతా ఏకమైనా బీజేపీని ఎదుర్కోలేరని అన్నారు. మతతత్వ పార్టీ అని ఆరోపించే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలే నిజమైన మతతత్వ పార్టీలని మండిపడ్డారు. చేవెళ్లలో మనకు ఎవరూ పోటీ లేరని మనకు మనమే పోటీ అని పేర్కొన్నారు. పోటీ చేసేందుకు ఆయా పార్టీలకు అభ్యర్థులు లేక స్థానికేతరులను తీసుకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు, ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు అంజన్‌కుమార్‌గౌడ్, రాజవర్ధన్ రెడ్డి, మల్లారెడ్డి, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘించొద్దు

అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ

అనంతగిరి: పార్లమెంటు ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా రాజకీయ ప్రజా ప్రతినిధులు సహకరించాలని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్లో ఎన్నికల నియామవళి అమలు, విధివిధానాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్‌శర్మ మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీ ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు వీలుగా సహకరించాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, పార్టీలు అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయొద్దని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సౌకర్యాలను సమకూర్చుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో వికారాబాద్ డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం ప్రతినిధులతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లింగ్యా నాయక్

పార్లమెంట్ ఎన్నికకు సహకరించండి

కొడంగల్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం ఎన్నికను పారదర్శకంగా నిర్వహించేందుకు నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ కోరారు. ఆదివారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అఖిల పక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున అధికారులు ఎన్నికల కమిషన్ పరిధిలోనే పని చేస్తారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నిక ప్రశాంతంగా పూర్తయ్యేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో 275 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, అఖిల పక్ష నాయకులు ఇందనూర్ బషీర్, కృష్ణంరాజు, రమేశ్‌బాబు, గుల్షన్, మోహన్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

హస్తం గూటికి ‘గులాబీ’లు

జిల్లాలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఇప్పటికే పట్నం దంపతులు కారు దిగి కాంగ్రెస్‌లో చేరగా.. సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి సైతం అదేబాటలో నడిచారు.

- వేగంగా మారుతున్న సమీకరణాలు
- కారు దిగి కాంగ్రెస్‌లో చేరిన సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి
- నాడు బీఆర్ఎస్ నుంచి నేడు కాంగ్రెస్ నుంచి పోటీ..?



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రంజిత్‌రెడ్డి

వికారాబాద్: లోక్‌సభ ఎన్నికల వేళ చేవెళ్ల నియోజకవర్గం పరిధిలో రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. సిట్టింగ్ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి కారు దిగి హస్తం చెంతకు చేరారు. ఆదివారం ఆయన బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సరిగ్గా ఐదేళ్ల కిత్రం 2019 మార్చిలోనే లోక్‌సభ ఎన్నికల సమయంలోనే వరంగల్‌కు చెందిన వ్యాపారవేత్త అయిన గడ్డం రంజిత్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకుని చేవెళ్ల ఎంపీగా అవకాశం కల్పించింది. అప్పటి వరకు ఈ ప్రాంత నాయకులు, ప్రజలు ఎవరికీ పరిచయం లేకపోయినా అప్పట్లో కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అని నమ్మి ఓట్లు వేసి గెలిపించారు. అనతికాలంలోనే ఆయన తనదైన శైలిలో రాజకీయంలో రాణించి పేరు సంపాదించుకున్నారు. బీఆర్ఎస్ పార్టీలో కీలక నేతగా ఎదిగారు. పార్టీ నాయకులు, ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన రాజకీయ జీవితం ఎంపీతోనే మొదలైంది. ఆ ఎంపీ పదవి ముగియక ముందే రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాలతో బీఆర్ఎస్ పార్టీ ఓటమిపాలు కావడం.. ఎమ్మెల్యేలు, నాయకులంతా ఒక్కరొక్కరుగా పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతుండడంతో ఆయన ఆత్మరక్షణలో పడిపోయారు. అందరికంటే ముందే చేవెళ్ల అభ్యర్థిగా మరోసారి రంజిత్‌రెడ్డి పేరు ప్రకటించినప్పటికీ జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఆయన పోటీకి వెనుకంజ వేశారు. అప్పటి నుంచి మౌనంగా పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. తెరవెనుక పావులు కదిపి చివరికి హస్తం గూటికి చేరారు.

ప్రజాప్రతినిధులంతా గాంధీభవన్‌కు..

బీఆర్ఎస్ నుంచి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు మొదలైన వలసలు ఇప్పటికీ ఆగడం లేదు. బీఆర్ఎస్‌లో ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులుగా కొనసాగుతున్న ద్వితీయ శ్రేణి ప్రజా ప్రతినిధులు మినహా ప్రస్తుతం ప్రజా ప్రతినిధులుగా ఉన్న పెద్దలంతా కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో నాలుగు నియోజకవర్గాల్లో ఇటీవల ఎన్నికల్లో పరాభవం పొందిన నేతలే పార్టీలో మిగిలారు. బీఆర్ఎస్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యేల్లో సైతం ఇద్దరు పక్క చూస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

సునీతారెడ్డికి చుక్కెదురు

కాంగ్రెస్ అధిష్టానం ఇంకా అధికారికంగా ప్రకటించనప్పటికీ చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థిగా రంజిత్‌రెడ్డి పోటీ చేస్తారనే తెలుస్తోంది. సునీతారెడ్డి మల్కాజిగిరి నియోజకవర్గం వెళ్లాలని కాంగ్రెస్ అధిష్టానం సూచించినట్లు సమాచారం. కాంగ్రెస్‌లో చేరింది మొదలు ఇప్పటికే చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ వస్తోంది. ఇటీవల ఆమె పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో పర్యటించింది. నియోజకవర్గంలో గ్రౌండ్ సిద్ధం చేసుకుంటున్న సునీతారెడ్డికి ఈ అనూహ్య పరిణామాలతో చుక్కెదురైనట్టయింది. మహేశ్వరం, శేరిలింగంపల్లి మినహా చేవెళ్ల నియోకవర్గంలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో వారికి పట్టుండటం.. వారి సొంత గ్రామం అదే పరిధిలోనే ఉండటం లాంటి అంశాలు ఆమెకు సానుకూలంగా మారతాయని భావించి ఆమె గెలుపుపై ఆశలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో ఆమెను మల్కాజిగిరి నియోజకవర్గానికి పంపుతారని జరుగుతున్న చర్చలు ఆమె వర్గాన్ని ఆందోళనకు గురిచేస్తుంది.

క్లుప్తంగా

నేడు పార్వతీపరమేశ్వరుల కల్యాణం



ఆలయ ముఖద్వారం

నవాబుపేట : ఈ నెల 8 శుక్రవారం మహాశి వరాత్రిని పురస్కరించుకుని ఎల్లకొండ పార్వతీ పరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నేడు 18న (సోమవారం) ఉదయం 8 గంటలకు రుద్రాభిషేకం, అమ్మవారికి విశేష అర్చన పల్లకీసేవ, మధ్యాహ్న 11.40 గంటల నుంచి పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 19న అభిషేకం, అర్చనలు, సాయంత్రం 6 గంటలకు కలశారోహణం(గుమ్మటం ఎక్కించుట) 20న రథోత్సవం, 21న ద్వాదశి నిండు జాతర, 22 త్రయోదశి నాగవెల్లి కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆలయ ప్రధాన అర్చకులు వివరించారు.

రిజర్వు ఫారెస్టులో సాసర్ పిట్ ఏర్పాటు



సాసర్ పిట్‌లో నీరు వదులుతున్న దృశ్యం

పెద్దేముల్: వన్యప్రాణుల దాహాన్ని తీర్చేందుకు పెద్దేముల్ మండలంలోని నాగులపల్లి రిజర్వు ఫారెస్టులో సాసర్ పిట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు నీటిని వదలటం జరుగుతుందని నాగులపల్లి ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ భాగ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ట్యాంకుల ద్వారా నీరు నింపడం జరుగుతుందన్నారు. ఇందుకు రైతులు సహకరించాలని కోరారు. అంతేకాకుండా అటవీ ప్రాంతంలో కలపను నరికితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పోలీస్ కేసులు కూడా నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటితే సకాలంతో వర్షాలు కురుస్తాయని, పంటలు కూడా పండుతాయన్నారు.

మహిళ బ్యాగు నుంచి నగలు చోరీ

చేవెళ్ల: బస్సు ఎక్కేందుకు బస్టాండ్‌కు వచ్చిన మహిళ బ్యాగులో నుంచి మూడున్నర తులాల బంగారు నగలు చోరీ చేశారు. ఈ ఘటన చేవెళ్ల బస్టాండ్‌లో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చేవెళ్ల మండల కేంద్రంలోని వీరభద్ర కాలనీకి చెందని స్వప్న శంకర్‌పల్లికి వెళ్లేందుకు చేవెళ్ల బస్టాండ్‌కు వచ్చింది. తన బ్యాగులో మూడున్నర తులాల బంగారు నగలు నల్లపూసల దండ, చెవి కమ్మలు, నగదు ఉన్నాయి. ఆమె బస్సు ఎక్కి కూర్చున్న కాసేపటికి బ్యాగును చూడగా జిప్ తీసి ఉండటంతో అనుమానం వచ్చి బ్యాగును చెక్ చేసుకోవడంతో అందులో ఉన్న బంగారు నగలు కనిపించలేదు. దీంతో స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు కూలి మృతి

యాచారం: ప్రమాదవశాత్తు ఓ కూలీ మృతి చెందిన ఘటన మాల్ గ్రామంలో చోటు చేసుకుంది. యాచారం సీఐ శంకర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మాల్ గ్రామానికి చెందిన ఇందూరి శేఖర్(58) గృహ నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. కొన్ని నెలలుగా అదే గ్రామానికి చెందిన ఖండే శ్రీను నిర్మిస్తున్న నూతన గృహ నిర్మాణ పనుల్లో కూలీగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం శ్రీను నూతన గృహానికి నీళ్లు పట్టి మెట్లపై నుంచి కిందకు దిగి వస్తున్నాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి పోయాడు. కిందపడిపోయిన శేఖర్‌కు ఇనుప రాడ్డు ఛాతీలో గుచ్చుకోవడంతో తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

'పట్నం' శిబిరంలో నైరాశ్యం!

- హస్తిన రాజకీయాలతో మారిన సీన్
- కారు దిగి కాంగ్రెస్‌లో చేరిన సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి
- అయోమయంలో జెడ్పీచైర్‌పర్సన్ సునీతారెడ్డి



కాంగ్రెస్ పార్టీ గుర్తు



పట్నం మహేందర్‌రెడ్డి



పట్నం సునీతారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్

తాండూరు: కాంగ్రెస్ ఢిల్లీ రాజకీయాలు పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబంపై తీవ్ర ప్రభావం చూపింది. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఇతర పార్టీల్లోని తమ మద్దతుదారులను హస్తం గూటికి తీసుకువచ్చారు. పార్లమెంట్ పరిధిలోనూ విస్తృత ప్రచారం చేశారు. కట్ చేస్తే చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకొని తన స్థానం పదిలం చేసుకున్నారు. ఒక్క సారిగా మారిన రాజకీయ సమీకరణలతో పట్నం శిబిరంలో నైరాశ్యం నెలకొంది.

జెడ్పీ చైర్‌పర్సన్‌గా హ్యాట్రిక్

మూడు దశాబ్దాల పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రాజకీయాలను శాసించిన పట్నం కుటుంబం రాజకీయంగా గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. 1994లో తాండూరు సెగ్మెంట్ నుంచి పట్నం మహేందర్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం మొదలైంది. వరుసగా నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా పనిచేశారు. రెండు సార్లు ఎమ్మెల్సీగా పదవి వరించింది. ఆయన సతీమణి పట్నం సునీతారెడ్డి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా రెండు సార్లు, వికారాబాద్ జిల్లా నుంచి జెడ్పీ చైర్‌పర్సన్‌గా హ్యాట్రిక్ విజయాలను సొంతం చేసుకున్నారు. వీరితో పాటు పట్నం మహేందర్‌రెడ్డి సోదరుడు పట్నం నరేందర్ రెడ్డి 2018లో కొడంగల్ అసెంబ్లీ నుంచి ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిపై విజయం సాధించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పట్నం కుటుంబం వేసిన తప్పటడుగులతో పట్నం కుటుంబమే కాకుండా వారి అనుచరగణానికి రాజకీయ జీవితంపై ప్రభావం పడింది.

కొంపముంచిన స్నేహధర్మం

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డిలు కళాశాల నుంచి మంచి మిత్రులు. 2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో రంజిత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ టికెట్ ఇప్పించడంలో పట్నం మహేందర్‌రెడ్డి కీలక భూమిక పోషించారు. దీంతో ఇద్దరి మధ్య స్నేహబంధం మరింత బలపడింది. కాగా 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరులో పట్నం మహేందర్‌రెడ్డి ఓటమి చెందారు. ఆ తర్వాత వరుసగా జరిగిన ఎన్నికలలో తన కేడర్‌ను గెలిపించుకున్నారు. మహేందర్‌రెడ్డి సైతం స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా విజయం సాధించారు. ఇంత వరకు బాగానే ఉన్న 2019లో కాంగ్రెస్ నుంచి గెలిచిన తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి కారెక్కారు. నాటినుంచి తాండూరులో వర్గపోరు మొన్నటి ఎన్నికల వరకు కొనసాగింది. గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పట్నంకు బీఆర్‌ఎస్ టికెట్ దక్కలేదు. దీంతో కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఆయన పార్టీ మారితే బీఆర్‌ఎస్‌కు నష్టం వాటిల్లుతుందని భావించిన అధిష్టానం ఎంపీ రంజిత్‌రెడ్డిని పట్నం వద్దకు పంపించి రాజీ కుదిర్చారు. అనంతరం ఆయనకు అమాత్య పదవి కట్టబెట్టారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బీఆర్‌ఎస్‌కు ప్రతికూలంగా వచ్చాయి. అందుకు పట్నం కుటుంబమే ఓటమికి కారణమని పార్టీ నాయకులు బహిరంగంగానే ఆరోపణలు చేశారు. మరోవైపు పట్నం సునీతారెడ్డి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటించి తన కేడర్‌ను బలపరుచుకున్నారు. ఈ విషయం తెలిసినా ఎంపీ రంజిత్‌రెడ్డి అదే స్థానం నుంచి హస్తం గుర్తుపై పోటీ చేసేందుకు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో పట్నం వర్గీయులు ఎంపీ రంజిత్‌రెడ్డి తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీగా గెలిపించిన కుటుంబానికే వెన్నుపోటు పడిచేలా రాజకీయాలు చేస్తున్నారంటూ విమర్శలు చేస్తున్నారు.

కండువాలు మార్చిన కేడర్

జిల్లాలో పట్నం మహేందర్‌రెడ్డి కేడర్ పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. బీఆర్‌ఎస్‌లో ఉన్న పట్నం అనుచరులు తమ స్థానాలను సుస్థిరం చేసుకున్నారు. కాగా చేవెళ్ల పార్లమెంట్ టికెట్ మనకే వస్తుందంటూ సునీతారెడ్డి గులాబీ కేడర్‌ను కాంగ్రెస్‌లోకి తీసుకువచ్చారు. ఆమె ఎంపీగా విజయం సాధిస్తే తమ రాజకీయ భవిష్యత్ మారుతుందని భావించిన పెద్ద ఎత్తున హస్తం గూటికి చేరారు. ఢిల్లీ రాజకీయాలతో పట్నం సునీతారెడ్డికి చెవెళ్ల టికెట్ రాదనే ప్రచారం మొదలైంది. తమను కాంగ్రెస్‌లో చేర్పించి రాజకీయంగా దెబ్బతీశారంటూ జిల్లాలో పట్నం కేడర్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోట్‌పల్లి ప్రాజెక్టులో తగ్గుతున్న నీరు



ధారూరు: పర్యాటకులకు స్వర్గధామంగా ఉన్న కోట్‌పల్లి ప్రాజెక్టులోని నీరు మండుతున్న ఎండలకు క్రమంగా తగ్గుతూ వస్తుంది. 24 అడుగుల నీటి మట్టం ఉన్న ప్రాజెక్టు నేడు 10 అడుగులకు చేరింది. ఎండలు ఇలాగే కొనసాగితే మే నెల వరకు మరో 5 అడుగులకు పడిపోయే అవకాశం సంబంధిత ఇరిగేషన్ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు కింద రైతులు వేరుశెనగ, వరి పంటలను సాగు చేశారు. మరోనెల రోజులు పంటలకు నీరందించాల్సి ఉంటుంది. ఆదివారం ప్రాజెక్టు ఒడ్డున తగ్గుతున్న నీటి ఫొటోలు తీసుకుంటూ పర్యాటకులు సందడి చేశారు. కొందరు పర్యాటకులు ఎండల వేడిమిని తట్టుకునేందుకు నీటిలో దిగి సేదతీరడం కనిపించింది.



ప్రాజెక్టు నీటిలో సేదతీరుతున్న యువత

యువకుడి అదృశ్యం

శంషాబాద్ రూరల్: తండ్రి మందలించాడని ఓ యువకుడు ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోట మండలం పామాపూర్ వాసి ఆరెపల్లి సుబ్రమణ్యం ఊటపల్లిలో నివాసం ఉంటున్నాడు. ఇతని కుమారుడు వినోద్ (18) రెండు నెలల కిందట కొత్త పల్సర్ బైక్ తీసుకుని ఇంటికి వచ్చాడు.ఐ ద్విచక్రవాహనం కొనేందుకు డబ్బులు ఎవరూ ఇచ్చారని తండ్రి అడిగాడు. దీంతో వినోద్ ఫిబ్రవరి 27న ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి



పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి



కృష్ణకుమార్ (ఫైల్)

అనంతగిరి: వికారాబాద్ మండలం పులుసుమామిడి గేట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణకుమార్(34), మరో ముగ్గురు ఏఆర్ కానిస్టేబుళ్లతో కలిసి ఓ శుభకార్యానికి వెళ్లారు. తిరుగుప్రయాణంలో మండలంలోని పులుసుమామిడి గేట్ సమీపంలోకి రాగానే ఎదురుగా ఓ కారు అతివేగంతో వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో కృష్ణకుమార్ తలకు బలమైన గాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కృష్ణకుమార్ అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ప్రభుత్వాసుపత్రిలో కృష్ణకుమార్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబీకులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు పేర్కొన్నారు.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి



కాంగ్రెస్‌పార్టీలో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. వారికి ఎమ్మెల్యే రంగారెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల కంటే సంక్షేమంలో నంబర్‌వన్ స్థానంలో కాంగ్రెస్ ఉండబోతుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మరింత అభివృద్ధి చెందడం ఖాయమన్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలకంపల్లి పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మణ్‌రావు, నాయకులు నర్సింహా, యాదయ్య, రాజు, కాటం రాజు పాల్గొన్నారు.

రైల్లో నుంచి పడి విద్యార్థి మృతి

కాచిగూడ: నడుస్తున్న రైల్లో నుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నానాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... అంబర్‌పేట ప్రాంతానికి చెందిన చిన్నపాక సురేందర్ కుమారుడు బాలాజీ (16) 10 తరగతి చదువుతున్నాడు. ఈనెల 18 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో తన స్నేహితులతో కలిసి గుడికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఎంఎంటీఎస్ రైల్లో వెళుతుండగా ప్రమాదవశాత్తు కాచిగూడ - మలక్‌పేట రైల్వే స్టేషన్ల మధ్య రైల్లో నుంచి కిందపడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరన్‌కోట్‌లో తాగునీటి కటకట



మిషన్‌భగీరథ నీళ్లు రావడం లేదని చూపుతున్న యువకుడు



కాలనీలోకి నీళ్లు రాకపోవడంతో ట్యాంక్ వద్దకు వచ్చి పట్టుకుంటున్న మహిళలు

- ఎండలకు అడుగంటిన భూగర్భజలాలు
- పత్తాలేని మిషన్‌భగీరథ నీళ్లు

తాండూరు రూరల్: వికారాబాద్ జిల్లాలోనే మేజర్ గ్రామ పంచాయతీ కరన్‌కోట్ గ్రామం. ఇక్కడ 10 వేలకుపైగా జనాభా నివసిస్తున్నారు. వేసవికాలంలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోర్ల నుంచి వచ్చే నీటిపైనే ఆధారపడుతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు పత్తాలేకుండా పోయాయి. నల్లా కనెక్షన్ ఇచ్చిన కూడా నీరు రావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామ ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి పట్టించుకోని తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు..

మా వడ్డెరబస్తీలో మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. బోరు నుంచి వచ్చే నీరు ఉదయం మాత్రమే వస్తోంది. మిషన్ భగీరథ పైపుల నుంచి నల్లా కనెక్షన్ ఇచ్చారు. అయినా కూడా నల్లా వృథాగా ఉంది. పైపులు ఎక్కడికక్కడ వృథాగానే పడి ఉన్నాయి.

> నీరు రాక రెండు రోజులు అవుతోంది..
>
> 
>
> గ్రామంలోని హనుమాన్ సమీపంలో రెండు రోజుల నుంచి తాగునీరు రావడం లేదు. వేసవికాలం కావడంతో నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నాం. ఎవరు పట్టించుకోవడం లేదు. దీంతో మసీదు సమీపంలో ఉన్న ట్యాంక్ వద్దకు వచ్చి నీటిని తెచ్చుకుంటున్నాం.
>
> – భారతి, కరన్‌కోట్ గ్రామం

నరేంద్రమోదీని కలిసిన సదానందరెడ్డి



మోదీకి అభివాదం చేస్తున్న సదానందరెడ్డి

అనంతగిరి: బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు, నారాయణపేట ప్రభారి సదానందరెడ్డి భారత ప్రధాని నరేంద్రమోదీని కలసి మట్లాడారు. మరోసారి దేశంలో మోదీ ప్రభుత్వం తప్పకుండా వస్తుందని సదానందరెడ్డి దీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో తప్పకుండా 12 సీట్లు సాధిస్తామన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

అన్న, వదినలపై అనుమానం



పరుశురాం (ఫైల్)

తాండూరు రూరల్: అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన తాండూరు మండలం సిరిగిరిపేట్‌లో ఆదివారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని సిరిగిరిపేట్ గ్రామానికి చెందిన పరుశురాం (24), తల్లిదండ్రులు మరణించడంతో అన్న, వదినల వద్దనే ఉంటున్నాడు. మేకలు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. గత 15 రోజుల క్రితం పరుశురాంకు మల్కాపూర్ గ్రామానికి చెందిన ఓ యువతితో పెళ్లి నిశ్చయించారు. ఉగాది తర్వాత పెళ్లి ముహూర్తం పెట్టుకుందామని ఇరుకుటుంబాలు మాట్లాడుకున్నారు. అయితే, ఆదివారం ఉ.10 గంటలకు సిరిగిరిపేట్‌లోని ఇంట్లో పరుశురాం విగత జీవిగా కనిపించాడు. దులానికి ఉరేసుకొని మృతి చెందినట్లు అన్న వదినలు చెప్పారు. కాగా, పరుశురాం పెళ్లి డబ్బుల విషయమై రాత్రి గొడవ జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదానికి బాధ్యులెవరు?

- ఎగిసిపడిన మంటలు
- గంటల తరబడి ట్రాఫిక్ జామ్
- రోడ్డుపై కాలువలా ప్రవహించిన ఆయిల్

గోల్కొండ: యూసుఫ్ టెక్డీ పెట్రోల్ బంక్ సమీపంలోని ఆయిల్ డిపోలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంతో పరిసర కాలనీల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. శుక్రవారం రాత్రి టోలిచౌకీ పెట్రోల్ బంక్ సమీపంలోని ఓ ఆయిల్ గోదాం అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. 15 ఫైర్ ఇంజిన్లు కొన్ని గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి. ఆయిల్ నిల్వ చేసిన గోదాంకు అసలు అనుమతులు ఉన్నాయా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాద తీవ్రతను బట్టి ఆ సమయంలో వేల బ్యారెళ్ల ఆయిల్ గోదాంలో ఉండి ఉండవచ్చునని తెలుస్తోంది. శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకోగా శనివారం ఉదయం వరకు మెహిదీపట్నం–టోలిచౌకీ రోడ్డుపై ఆయిల్ వరదలా ప్రవహిస్తుండడం గమనార్హం. అదృష్టవశాత్తు ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం చోటు చేసుకోకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలానికి ఆనుకుని పెట్రోల్ బంక్, దాని సమీపంలోనే పలు వ్యాపారసముదాయాలు ఉన్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే యూసుఫ్ టెక్డీ ఫుడ్ కోర్టు సైతం ఘటన స్థలానికి అతి సమీపంలోనే ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో ఆ ప్రాంతంలోని రెస్టారెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు రద్దీగా ఉన్నాయి. రంజాన్ మాసం కావడంతో ఆయా ప్రాంతాల్లోని హోటళ్ల హలీం కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. అగ్ని ప్రమాదంతో ఇటూ షేక్‌పేట్ నాలా వరకు అటు మెహిదీపట్నం వరకు ఇరు వైపుతా రోడ్లపై వాహనాలు నిలిచి పోయాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎవరూ ఘటనా స్థలానికి చేరుకోలేదు. కేవలం హుమాయూన్‌నగర్ పోలీసులు మాత్రమే సహాయక చర్యలను పర్యవేక్షించారు. శనివారం ఉదయం స్థానిక యువకులు వాహనాల రాకపోకలను నియంత్రించారు.

మహిళాభ్యున్నతితోనే సమాజ వికాసం

రిటైర్డ్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌మిశ్రా

సనత్‌నగర్: నేటి సమాజంలో మహిళలు లేని రంగం ఏదీ లేదని, అన్ని రంగాల్లో మహిళలు రాణించడంతోనే సమాజ వికాసం జరుగుతుందని రిటైర్డ్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌మిశ్రా అన్నారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న 50 మంది నేటితరం మహిళలను సేవ్ ద గర్ల్ చైల్డ్, ముందడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించి 'ఉమెన్ ఎంపవర్‌మెంట్ అవార్డ్స్' అందజేశారు. ఆదివారం బేగంపేట టూరిజం ప్లాజాలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌మిశ్రా మాట్లాడుతూ మహిళలు శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనే కాకుండా సేవా, రాజకీయ రంగాల్లోనూ సత్తా చాటుతున్నారన్నారు. గ్రామ స్థాయి నుంచి మహిళల ప్రతిభను గుర్తించి సత్కరించడం అభినందనీయమన్నారు. చంచల్‌గూడ జైలు ఎస్పీ శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఆడపిల్లను కాపాడుకుందాం..ఆడ పిల్లను రక్షిద్దాం అనే ఆలోచనతోనే సంస్థ ఏర్పాటైందన్నారు. ఆడపిల్లలు ఎక్కడ అఘాయిత్యానికి గురవుతున్నారో అర్థంకాని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఒకప్పుడు ఆడపిల్ల పుట్టింది అంటే మహాలక్ష్మీ అనుకునేవారని, ఇంటిల్లిపాది సంబరాలు చేసుకునేవారన్నారు. ఆడ పిల్లలను చదివిద్దాం..ఎదగనిద్దాం.. అనే ఆలోచనతో అందరం ముందుకు సాగుదామన్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ సృష్టికి, మహిళకు విడదీయరాని సంబంధం ఉందన్నారు. సృష్టి నిర్మాణంలో మహిళదే ప్రముఖ పాత్ర అన్నారు. పురాణాలు, ఇతిహాసాలు, ఎన్ని చూసినా త్యాగాల్లో మహిళలు ముందుంటారన్నారు. కార్యక్రమంలో ముందడుగు ఫౌండేషన్ ఫౌండర్ రాజేంద్ర, సలహాదారులు కళింగకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుభాషిణి, ముందడుగు డైరెక్టర్ జయరాం, కొమటి రమేష్‌బాబు, బత్తిని రాజేష్, వరికుప్పల గంగాధర్, కొక్కుల ప్రశాంత్, నూలి గుప్తా, హరిప్రకాష్, హరి, లక్ష్మీకళ, గీత తదితరులు పాల్గొన్నారు.

ఫాంహౌస్‌లో మద్యం పట్టివేత

శంషాబాద్ రూరల్: మండలపరిధిలోని పోశెట్టి గూడ శివారులో గల నవీ ఫాంహౌస్‌లో మద్యం సీసాలను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. వీటిని ఇక్కడ నిల్వ చేసేందుకు ఎలాంటి అనుమతి లేదని బాటిళ్లు కలిగి ఉన్న రోహిత్, రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకుని మద్యాన్ని సీజ్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా మోర్చా రూరల్ అధ్యక్షురాలిగా రమాదేవి



బొక్క నర్సింహారెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న రమాదేవి

అబ్దుల్లాపూర్‌మెట్ : బీజేపీ మహిళా మోర్చ రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షురాలిగా అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామానికి చెందిన బొడిగె రమాదేవిని నియమించారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆదివారం ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో పార్టీ పెద్దలు పదవి ఇచ్చినందుకు సంతోషంగా ఉందని అన్నారు. జిల్లా మహిళా మోర్చతోపాటు పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చ అధ్యక్షురాలు శిల్పా రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

నర్సింహారెడ్డికి అభినందనల వెల్లువ

కడ్తాల్: స్టేట్ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో డీసీసీ ప్రతి అధికార నిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యా నాయక్‌లు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీకి చేసిన సేవలకు గుర్తుగా నర్సింహారెడ్డికి రాష్ట్రస్థాయిలో సముచిత స్థానం రావడం హర్షణీయమని వారు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ పదవీ కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, సహకరించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, నాయకులు జగన్‌నాయక్ ఉన్నారు.